AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
29-9-2025 (Monday) MAIN EDITION

## టాటా క్యాపిటల్ ప్రైస్ బ్యాండ్ ఫిక్స్..




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** టాటా గ్రూప్ నుంచి వస్తున్న మరో అతిపెద్ద ఐపీవో సైజ్‌తో పాటు ప్రైస్‌బ్యాండ్ ఖరారయ్యాయి. ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 15,511.87 కోట్లు సమీకరించనుంది. వచ్చేనెల 6వ తేదీన ప్రారంభం కానుంది. 21 కోట్ల తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ. 6,846 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 10 ముఖ విలువ కలిగిన 26.58 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా మరో 8,665.87 కోట్లను సమీకరించనుంది.

## జొమాటోలో కొత్త ఫీచర్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పోషకాహారం సైతం డెలివరీ చేసేలా ఆప్షన్ తీసుకువచ్చింది. పోషకాలతో కూడిన ఫుడ్‌ను ఎంచుకునేలా వినియోగదారుల కోసం హెల్తీ మోడ్‌ను ప్రవేశపెట్టింది. ఈ మోడ్‌తో ఎంచుకున్న ఆహారంలోని పోషక విలువల రేటింగ్‌ను తెలుసుకోవచ్చు. ఈ విషయాన్ని తెలియజేస్తూ జొమాటో సీఈవో దీపిందర్ సింగ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద



**అక్షరటుడే, ఏపీ డెస్క్:** శ్రీశైలం జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం పెరిగింది. దీంతో 10 స్పిల్ వే గేట్లను 23 అడుగుల మేర ఎత్తి 5.90 లక్షల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 205.22 టీఎంసీలుగా ఉంది.

## ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్‌చంద్ర




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరు 9 నుంచి ఆయన నియామకం అమల్లోకి రానుంది. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

## రెండు గంటల పనికి రూ. 11 కోట్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రచారం చేస్తున్నారు. తాను గతంలో రెండు గంటల పాటు పనిచేసినందుకు రూ.11 కోట్లు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇది బీహార్ కుర్రాడి శక్తి అని ఆయన అన్నారు.

## పైరసీ ముఠాను పట్టుకున్న పోలీసులు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** కోట్ల రూపాయలు పెట్టి తీసిన సినిమాలను కొందరు పైరసీ చేసి ఆన్‌లైన్‌లో పెడుతున్న విషయం తెలిసిందే. దీంతో నిర్మాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తాజాగా హైదరాబాద్ పోలీసులు దేశంలోనే అతి పెద్ద పైరసీ ముఠాను అరెస్ట్ చేశారు. శ్రీ విష్ణు హీరోగా తెలుగులో సింగిల్ మూవీని అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ చిత్రం మే 1న విడుదలైంది. అయితే ఈ సినిమాను కొందరు పైరసీ చేశారు. దీంతో చిత్ర బృందం గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు జులై 3న వనస్థలిపురానికి చెందిన కిరణ్‌ను పైరసీ కేసులో అరెస్ట్ చేశారు. అతడిని విచారించి ముఠా సభ్యులు దుబాయి, మయన్మార్, నెదర్లాండ్ కేంద్రంగా దందా చేస్తున్నట్లు గుర్తించారు. తాజాగా అందులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు.



**గత కొద్ది నెలలుగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఎట్టకేలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఐదు విడతల్లో పరిషత్, పంచాయతీ ఎన్నికలను పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుంది. ఆ తర్వాతే సర్పంచ్, వార్డు మెంబర్ ఎలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపింది. అక్టోబర్ 9వ తేదీన ప్రారంభం కానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నవంబర్ 11తో ముగియనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 9న నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఆ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# స్థానిక పోరుకు.. మోగిన నగారా

- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఈసీ
- అక్టోబర్ 9న నోటిఫికేషన్.. ఐదు విడతల్లో పోలింగ్
- రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్లు
- మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు
- అమల్లోకి కోడ్

రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని విడుదల చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 31 జిల్లాల్లోని 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 656 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 9న నోటిఫికేషన్ జారీ చేకానుంది. తొలి రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో 2,963, రెండో విడతలో 2,786 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుంది. అలాగే, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి మొదటి విడతలో 292, రెండో విడతలో 273 చోట్ల పోలింగ్ జరగనుంది.

### మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు..

పరిషత్ ఎన్నికలు పూర్తయ్యాక పంచాయతీ పోరుకు తెర లేవనుంది. మూడు మూడు విడతల్లో గ్రామపంచాయతీ, వార్డు ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో 1,998 గ్రామపంచాయతీలు, రెండో విడతలో 5,414 జీపీలకు, చివరి విడతలో 5,521 గ్రామపంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగిన రోజు సాయంత్రమే కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడించనున్నారు.

### పలు చోట్ల ఎన్నికలు వాయిదా..

గ్రామ పంచాయతీలకు సంబంధించి తొలి విడత అక్టోబర్ 31న , మలి విడత నవంబర్ 4న, తుది విడత నవంబర్ 9న ఎన్నికలు జరుగనున్నాయి. అయితే, హైకోర్టు తాజా ఆదేశాలతో కొన్ని స్థానాల్లో స్థానిక పోరు వాయిదా పడింది. ములుగు, కరీంనగర్ జిల్లాల్లోని 14 ఎంపీటీసీ, 27 గ్రామపంచాయతీలు, 246 వార్డులకు ఎన్నికల అంశం కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఆయా చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి.


### ముగ్గురు పిల్లలుంటే పోటీకి అనర్హులే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే అర్హుల కాదా అనే విషయంలో ఎలక్షన్ కమిషన్ క్లారిటీ ఇవ్వలేదు. కాగా.. ఇద్దరికి మించి పిల్లలు ఉన్న వారు పోటీ చేయడానికి అర్హులు కాదనే నిబంధన 1995 సంవత్సరం నుంచి అమలులో ఉంది. అయితే ఈ నిబంధన ఎత్తి వేయడానికి ప్రభుత్వం ఎలాంటి జీవో జారీ చేయలేదు. దీంతో పాత నిబంధన మేరకు ఎన్నికలు జరగనున్నాయి. ఫలితంగా ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారు పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. అయితే ఏపీ ప్రభుత్వం ఈ నిబంధనను తాజాగా ఎత్తివేయగా.. తెలంగాణ సర్కారు మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయినందున పాత నిబంధనలే ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ రావడంలో రాష్ట్రంలో కోడ్ అమలులోకి వచ్చింది.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం: బీజేపీ

**అక్షరటుడే, హైదరాబాద్:** స్థానిక ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో మెజారిటీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో కాషాయ పార్టీ బలపడిందని.. అత్యధిక స్థానాల్లో గెలుస్తామన్నారు.

## జీపీ కార్యదర్శులకు గుడ్‌న్యూస్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు గుడ్ న్యూస్ చెప్పింది. వారి బిల్లుల చెల్లింపు కోసం రూ.104 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కార్యదర్శుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. నిధుల విడుదలపై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు.

## ఇందిరమ్మ క్యాంటీన్స్‌లో అల్పాహారం ప్రారంభం



**అక్షరటుడే, హైదరాబాద్:** ఇందిరమ్మ క్యాంటీన్ పథకం కింద మరో కార్యక్రమం ప్రారంభమైంది. నగరంలోని పేదలు, రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, బస్తీ వాసుల కోసం రూ.5కే నాణ్యమైన టిఫిన్ అందించే స్కీంను హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో జీహెచ్ఎంసీ అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం నగరంలోని 60 ఇందిరమ్మ క్యాంటీన్లలో ఈ టిఫిన్ పథకం అమలులోకి వచ్చింది. త్వరలోనే ఈ సంఖ్యను జీహెచ్ఎంసీ 150 క్యాంటీన్ల వరకు విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని మంత్రి పొన్న ప్రభాకర్, మాజీ మేయర్ విజయలక్ష్మి ప్రారంభించారు.

## 'రియల్' దందా కోసమే ఫ్యూచర్ సిటీ



**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. దీనిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సోమవారం స్పందించారు. రియల్ ఎస్టేట్ దందా కోసమే రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. సీఎం, ఆయన బంధువులు కొనుగోలు చేసిన వేల ఎకరాల భూముల ధరలు పెంచుకోవడానికి తప్ప దీంతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ ఎమిటో తెలియని ఎద్దేవా చేశారు. ఆయన పదవి ఎప్పుడు పోతుందో తెలియదని, ఫ్యూచర్ సిటీ ఎలా నిర్మిస్తారంటూ వ్యాఖ్యానించారు. లేని ఫ్యూచర్ సిటీ నుంచి ఇంకా పూర్తి నిర్మాణం కాని అమరావతికి గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్వే లైన్ ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా రాష్ట్రంలో మంత్రుల వ్యవహార తీరుపై సైతం జగదీశ్ రెడ్డి విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి ఒక మాట మాట్లాడితే, మంత్రులు, ఎమ్మెల్యేలు మరో మాట మాట్లాడుతున్నారన్నారు. వీళ్లు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా అని ప్రశ్నించారు.

## కాళేశ్వరం అక్రమాలపై రంగంలోకి ఏసీబీ..

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రాజెక్ట్ అక్రమాలపై విచారణ చేపట్టాలని విజిలెన్స్ అధికారులు ఏసీబీకి లేఖ రాశారు. కాళేశ్వరం అక్రమాలపై ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేపట్టి నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ ప్రాథమిక విచారణను కూడా ప్రారంభించింది. ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేయనుంది. మరో వైపు ఏసీబీ సైతం రంగంలోకి దిగనుండడం గమనార్హం.

### ప్రభుత్వం అనుమతిస్తే..


కాళేశ్వరం నిర్మాణం పేరిట బీఆర్ఎస్ హయాంలో భారీగా అవినీతికి పాల్పడ్డారని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో పలుమార్లు ఆరోపించారు. ఘోష్ కమిషన్ కూడా అక్రమాలపై పూర్తి వివరాలను నివేదిక రూపంలో సమర్పించింది. అయితే సీబీఐ దర్యాప్తు జరుపుతుండగా.. ఏసీబీకి విజిలెన్స్ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాంట్రాక్టర్ల నుంచి బాధ్యులు ఎలా లబ్ధి పొందారో విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులు ఏసీబీని కోరారు. ఈ లేఖను ప్రభుత్వ ప్రధాన




కార్యదర్శి రామకృష్ణారావుకు ఏసీబీ డీజీ పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ఏసీబీ విచారణ ప్రారంభించనుంది.

### కొనసాగుతున్న సీబీఐ విచారణ

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సీబీఐ విచారణ చేపట్టింది. ప్రాజెక్ట్‌లో అవకతవకలు, నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై సీబీఐ అధికారులు ప్రాథమిక దర్యాప్తు చేపడుతున్నారు. ఎన్డీఎస్ఏ, పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో విజిలెన్స్ కమిషన్ ఏసీబీకి లేఖ రాయడం గమనార్హం.



## సరస్వతి దేవిగా అమ్మవారు..

**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మూల నక్షత్రంలో అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా బాసర సరస్వతి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. అక్షరాభాస్యానికి భక్తులు భారీగా తరలివచ్చారు.**

—అక్షరటుడే, బాసర



## బస్సులో ప్రయాణించిన సజ్జనార్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ఆర్టీసీ ఎండీగా చివరి రోజు బాధ్యతల్లో ఎండీ సజ్జనార్ బస్సులో ప్రయాణించారు. ప్రజా రవాణాపై అనుబంధాన్ని వ్యక్తం చేస్తూ సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపూల్ నుంచి టెలిఫోన్ భవన్ వరకు బస్సులో వెళ్లారు. ఈ సందర్భంగా యూపీఐ పేమెంట్ చేసి ఆయన టికెట్ తీసుకున్నారు. కాగా.. సజ్జనార్ హైదరాబాద్ సీపీగా బదిలీ అయిన విషయం విధితమే.